క్లుప్తంగా

ఐషర్ వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఐషర్ వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతుడి తల నుజ్జు నుజ్జయి గుర్తించలేనంతగా మారింది. వాహనాన్ని గుర్తించామని, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి



మృతి చెందిన పక్కీరప్ప (ఫైల్)

పులివెందుల రూరల్: పట్టణంలోని దర్గా వీధిలో నివాసముంటున్న పక్కీరప్ప వారం రోజుల కిందట అదృశ్యమై శుక్రవారం కాల్వలో విగతజీవిగా కనిపించాడు. పోలీసుల వివరాల మేరకు.. పక్కీరప్ప వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటికి వెళ్లారు. అనంతరం తిరిగి రాకపోవడంతో ఆయన కుమార్తె, మనుమడు గంగాధర్, మనమరాలు వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ కనిపించలేదు. నాలుగు రోజుల కిందట పులివెందుల పోలీస్ స్టేషన్‌లో పక్కీరప్ప అదృశ్యమైనట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం నల్లపురెడ్డిపల్లె రహదారిలోని వంతెన సమీపంలోని కాలువలో పక్కీరప్ప శవమై కనిపించాడు. పులివెందుల పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ నారాయణ చేరుకుని మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం సరిగా లేనందు వల్ల జీవితం మీద విరక్తి చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు పోలీసులకు తెలిపారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని చిన్నకత్తెరపల్లె శివారున పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,16,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

నేడు విద్యుత్ నిలిపివేత

వేంపల్లె : స్థానిక పట్టణంలోని 33/11కె.వి ఫీడర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ జేఈ శివదినేష్ తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, బాయ్స్ హైస్కూల్, ఎస్సీ కాలనీ, కాపు వీధి, ప్రభుత్వాసుపత్రి, చైతన్య స్కూల్, పాత మార్కెట్, అమ్మవారిశాల వీధి, టీటీడీ కల్యాణ మండపం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కమలాపురం : పట్టణంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు తహసీల్దార్ కార్యాలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. యువకులు, ఓటర్లు, సీనియర్ సిటిజన్లు అందరూ పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. అలాగే అన్ని పోలింగ్ స్టేషన్లలో కూడా బీఎల్వోలు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. సీనియర్ సిటిజన్లను సన్మానించాలని ఆయన తెలిపారు.

లింగాలలో..

లింగాల : 18 ఏళ్లు నిండిన వారందరిని ఓటు హక్కుకు ప్రోత్సహించాలని మండల తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్ఓలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. 25వ తేదీ పోలింగ్ కేంద్రాలను బీఎల్ఓలు ఆధీనంలోకి తీసుకుని ఓటర్ల జాబితాను చదివి వినిపించి వయో వృద్ధులకు సన్మానం చేయాలన్నారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు.

వీఏఏలను నియమించండి

సింహాద్రిపురం : స్థానిక రైతు సేవా కేంద్రం-1, 2లలో ఇద్దరు వీఏఏలు బదిలీపై వెళ్లడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల వ్యవసాయ మాజీ సలహాదారుడు అరవిందనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో రెండు నెలల నుంచి వీఏఏలు లేకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను దిగుబడులు గుర్తించి ఇస్తే రైతులు ఇన్సూరెన్స్ చేసుకోవడానికి వీలవుతుందన్నారు. వీరు లేకపోవడంవల్ల సాగు చేసిన రైతులకు వచ్చే నష్టపరిహారం కోల్పోతారన్నారు. త్వరగా గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లను నియమించాలని ఆయన కోరారు.

నేడు సంతకాల సేకరణ

జమ్మలమడుగు : కడప హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలింపునకు నిరసనగా పాత బస్టాండ్ వద్ద సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్లు ఏపీ జీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలనుంచి రాయలసీమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సేవ్‌పబ్లిక్ సెక్టార్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోగులకు సేవలు అంతంతమాత్రమే

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బయటనే వైద్య చికిత్సలు
- పిచ్చి మొక్కలతో నిండిన ఆసుపత్రి ఆవరణం



వేములలో అన్ని సదుపాయాలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మార్చివేసింది. వేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో అన్ని సదుపాయాలతో నిర్మించారు. ఈ ఆసుపత్రులలో 24 గంటల వైద్య సేవలు అందంచటమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యుల నిర్లక్ష్యంతో రోగులకు అంతంత మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రానికి వేముల, శేషన్నగారిపల్లె, బచ్చయ్యగారిపల్లె, కుప్పగుట్టపల్లె, గొందిపల్లె గ్రామాల నుంచి రోగులు రోజుకు 130 నుంచి 150 మంది చికిత్సల కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యాధికారులు పనిచేస్తున్నారు. ఆసుపత్రిలో 14 మంది విధులలో ఉంటున్నారు. ఇంతమంది సిబ్బంది ఉన్నప్పటికీ రోగులకు చికిత్సలు అంతంతమాత్రమే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్సలు చేయకుండానే మందుల చీటీ రాసిచ్చేసి మందులు తీసుకెళ్లండంటూ చెబుతున్నారు. రోగులను ఆరు బయటనే నిల్చోబెట్టి రోగులకు చికిత్సలు చేస్తున్నారు. కేంద్రం ఆవరణం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఆసుపత్రి నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఆసుపత్రి ఆవరణలో రోగుల కోసం నిర్మించిన అరుగులు పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారాయి. రోగులు అరుగులపై కూర్చొనేందుకు వీలు లేకుండా ఉంది. ఆసుపత్రిలో సిబ్బంది తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని రోగులు వేడుకుంటన్నారు.



పిచ్చి మొక్కలతో నిండిన ఆసుపత్రి ఆవరణం



అరుగుల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

పులివెందుల రూరల్ : ప్రతి ఇంట్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎర్రగుడిపల్లెలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వ లున్న నీటిలో అబైట్‌ను పిచికారి చేసి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ కాటువలన మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మురికి కాలువలో అబైట్‌ను పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

శనగ పంటకు ముసురుదెబ్బ

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రబీలో సాగు చేసిన శనగ పంటకు అకాల వర్షం, ముసురు దెబ్బతో శనగ రైతులు తీవ్ర నష్టాలు చవి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీలో సాగు చేసిన శనగ పంట దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించక ఖరీఫ్ పంట దిగుబడులు శూన్యమయ్యాయని, అప్పులు చేసి శనగ పంట సాగు చేసి దిగుబడులపై ఆశలు పెట్టుకుంటే ఇటీవల కురిసిన వర్షాలతో శనగ దిగుబడులు రాక కంటతడి పెట్టిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటకు మొదటి నుంచే ఆకాశంలో ముసురు మబ్బులు, అకాల వర్షాలతో పూత రాలి శనగ పంట దెబ్బతింటోంది. దిగుబడి కూడా ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని రైతులు దిగులు చెందుతున్నారు.



ముసురు మబ్బులతో దెబ్బతింటున్న శనగ పంట

టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయి

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ఇంగ్లీష్ ప్రతిభను గుర్తించడానికి టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయని మండల విద్యాశాఖాధికారులు రమణారెడ్డి, చౌడయ్య, చంద్రశేఖర్‌లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన విద్యార్థులకు ఇంగ్లీషు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



గెలుపొందిన విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న ఎంఈఓ చౌదయ్య

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పాలక మండలిలో శనివారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన బడ్జెట్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తారని కౌన్సిల్ సభ్యులు అధికారులు హాజరు కావాలని సూచించారు.

గోడౌన్ వద్ద ధర్నా

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న ప్రభుత్వ సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఏఐటీయూసీ అనుబంధ ఏపీ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్న నిర్వహించినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలి కూలీలకు రేట్లు పెంచాలన్నారు. వారి శ్రమను దోచుకుంటున్నారన్నారు. హమాలీ కార్మికుల శ్రమను గుర్తించి వారికి వేతనాలు పెంచి ఇవ్వాలని లేకపోతే ఉద్యమం చేస్తామన్నారు.

27న కలెక్టరేట్ ముట్టడి

జమ్మలమడుగు : అర్హులైన నిరుపేదలకు సాగు భూమి, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఆపార్టీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలకు ఇళ్ల పట్టాలతోపాటు సాగుభూమి ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ ముట్టడికి ప్రతి నిరుపేద హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దంత సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వేంపల్లె : ప్రస్తుత జీవన శైలిలో ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై దృష్టి సారించాలని డెంటల్ వైద్యుడు బషీర్ అహమ్మద్ తెలిపారు. శుక్రవారం స్థానిక పులివెందుల రోడ్డులోని మసీదు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సన దంత ఆసుపత్రిని రిటైర్డ్ ఉపాధ్యాయుడు మీరావల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా డెంటల్ డాక్టర్ బషీర్ అహమ్మద్ మాట్లాడుతూ మానవునికి సోకే అన్ని రోగాలకు మూలం దంతాలు కాబట్టి దంతాలను రక్షించుకొంటే అన్ని అవయవాలు రక్షించుకున్నట్లేనన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న ఏడీ రమణారెడ్డి

కమలాపురం : అన్ని గ్రామాల్లో ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌డీపీ కడప ఏడీ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని టి.చదిపిరాళ్లలో పెద్దచెప్పలి పశు వైద్యాధికారిణి శివజ్యోతి పర్యవేక్షణలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. పశు పోషకులతో మాట్లాడారు. అలాగే ఆయన స్వయంతో పశువులకు వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. పశు పోషకులు వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. అలాగే పాడి పరిశ్రమ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన పశువులకు 116 సాధారణ చికిత్సలు, 49 గర్భ సంబంధిత చికిత్సలు, 17 చూడి నిర్ధారణ పరీక్షలు, 33 లేగ దూడలకు ఏలికపాము మందులు, 82 జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పుష్కలంగా పోషకాలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కలీముల్లా

పులివెందుల టౌన్ : చిరుధాన్యాలతో శరీరానికి పోషకాలు పుష్కలంగా అందుతాయని తిరుపతి పరిశోధన పథక కలీముల్లా తెలిపారు. శుక్రవారం చిన్నరంగాపురం సమీపంలో ఉన్న ఫుడ్అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో చిరుధాన్యాలపై అవగాహన, ప్రాసెసింగ్ యంత్రాల సందర్శన అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా హాజరై చిరుధాన్యాల ఉపయోగాలు, ఆవశ్యకత, పోషకాలు, యంత్రాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల నుండి విలువ ఆధారిత ఉత్పత్తులపై ప్రసంగించారు. అధ్యాపకులు సాయి శ్రీనివాస్, కీర్తిరెడ్డి చిరుధాన్యాల యంత్రాల పనితీరును ప్రదర్శన చేసి అభ్యర్థులకు చూపించారు. కార్యక్రమంలో కళాశాల ఆసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, ఎల్‌బీఐ అధికారి ఇంజనీర్ నజ్మా, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

లేగదూడలను కాపాడుకోవాలి



ప్రదర్శనలో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ

చింతకొమ్మదిన్నె : లేగదూడలను ఆరోగ్యంగా పెంచుకుని కాపాడుకోగలితే పాడి ద్వారా పశుపోషకులు అధిక ఆర్థిక వృద్ధి సాధించవచ్చునని పశువైద్యులు తెలిపారు. లేగదూడల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం ఇప్పపెంట గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో పశువులకు సంబంధించిన వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ అలాగే రైతులకు పాడి పశువుల దాణా, ఆరోగ్యం, తదితర విషయాల గురించి పలు సూచనలు చేశారు. కొందరు పాడి పోషకులకు ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, ఏడీ శ్రీధర్‌లింగారెడ్డి, పశువైద్య సిబ్బంది, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం మోహన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీలర్ల రాత పరీక్షలు



డీలర్ల రాత పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 251 రేషన్ షాపు డీలర్ల కోసం నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రాత పరీక్షలను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. పరీక్షలను మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించారు. 204 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 179 మంది హజరైనట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పరీక్షలను పర్యవేక్షించారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

ఎర్రగుంట్ల : రైతులు వారి పొలాలలో మట్టి పరీక్షలు చేయించుకున్న తర్వాత ఎరువులు వినియోగించాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం చిన్నదండ్లూరు, ఇల్లూరు గ్రామాలలో సాగు చేసిన వరి పొలాలను వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డితో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి పొలాలు వాతావరణ పరిస్థితులు, జింకు లోపం వలన పంట ఎదుగుదల కూడా తక్కువగా ఉంటుందన్నారు. నివారణ కోసం జింక్ సల్ఫేట్ 33 శాతం, జింక్‌ను 1 గ్రామ్ లీటర్‌కి 19.19.19 ఎరువును 5 గ్రాములు కలపి పిచికారి చేసుకోవాలన్నారు. రబీ పంటలైన శనగ, మినుము, నువ్వులు, వరి, పెసర తదితర రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

లింగాల : లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విద్యార్థులకు బాలికా దినోత్సవ ప్రాముఖ్యత, పౌష్టికాహార ప్రాధాన్యత, మహిళలపట్ల జరుగుతున్న ఆరాచకాలకు వ్యతిరేకంగా నిర్భయ, దిశ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల విద్యా సహాయకులు రఘునాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రావణి, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : సమాజం బాగుపడాలంటే ఆడ, మగ ఇద్దరిని సమానంగా చూడాలని డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, సమానత్వం ద్వారా సాధికారత సాధించవచ్చునన్నారు. సృష్టికి మూలం స్త్రీ మొదటి సంతానమన్నారు. ఆడ పిల్లలు ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ ఆడపిల్లలు పుట్టిన దంపతులు మగ సంతానం కావాలని ఆలోచిస్తారని, ఆడ పిల్లలకు వరకట్నం ఇవ్వవలసి రావడం, కొడుకు వల్ల వంశాభివృద్ధి జరుగుతుందని నమ్మకంతో కుటుంబ పెద్దల ఒత్తిడి వలన ఆడపిల్లలు వివక్షతకు గురవుతున్నారన్నారు. అనంతరం ఎంఐఓ స్టాలిన్ విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, సిహెచ్ఓ పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి దేవి, భారతిలు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : సమాజంలో లింగ వివక్షను అరికట్టాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లల హక్కులను పరిరక్షించాలని, పోషకాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించి ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. సమాన లింగ నిష్పత్తి పాటించాలన్నారు. అనంతరం ఆయన మహిళలతో కలిసి బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆఫ్రీన్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవంపై కార్యకర్మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనివ్వాలని, వారిని చదివించాలని, ఆడపిల్లలే దేశ భవిష్యత్‌కు పునాది అని వివరించారు. బాల్య వివాహాల గురించి తెలియజేయడంతోపాటు లింగ వివక్ష చూపరాదని, రక్తహీనత, పోషకాహార విలువల గురించి విద్యార్థులకు వివరించారు. ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, వారికి స్వేచ్ఛనిస్తూ బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : చిలంకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు సాయిచరితరెడ్డి, గణేష్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టరిత్యా భ్రూణ హత్యలు నేరమన్నారు. ఇలా చేసిన వారికి 3 నుంచి 5 సంవత్సరాలు వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. తల్లిదండ్రులకు ఆడ, మగ ఇద్దరు సమానులే అని ఆడపిల్లను చదివించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్‌లు సుభద్ర, పుల్లమ్మ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఆడపిల్ల బారం కాదని దేవుడిచ్చిన వరమని మండల వైద్యాధికారి మహ్మమ్మద్ తాహ అన్నారు. శుక్రవారం స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలనే చిన్న చూపు చూడకుండా వారిని బాగా చదివించాలన్నారు. బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సుబాషిణి మాట్లాడుతూ ఏ విషయంలో నైనా నేను ఆడపిల్లను అనే భావన మీలోకి రానివ్వకుండా ధైర్యంగా ముందుకు నడవాలని సూసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



లింగాలలో బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రావణి



తొండూరులో ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



వేములలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



చిలంకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థినులు



వీరపునాయునిపల్లెలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు